జ్యోతి: అక్టోబర్, 1984

# మిణుగురు పురుగు

మేడమీది గదిలోకి ఎవరో క్రొత్తగా అద్దెకొచ్చారని తెలుసు! ఎవరో తెలియదు వసంత లక్ష్మికి. ఉదయం ఎనిమిదయ్యేసరికల్లా ఆఫీసులో ఉండాలి. లేకపోతే ఆ రోజు జీతం రాదు. మళ్ళీ ఆఫీసనే చెర నుండి బయటపడడం సాయంత్రం ఆరింటికే! సిటీబస్సు దొరికి కొంపకు చేరేసరికి దీపాలు పెడతారు. ఇంటికొచ్చి క్షణం అలా విశ్రాంతి తీసుకుని, గిన్నెలు కడుక్కోవడం, నీళ్ళు పట్టుకోవడం, వంట వార్పు అయ్యేసరికి రేడియోలో ఇంగ్లీషువార్తలు ప్రారంభమౌతాయి. దినపత్రికలో శీర్షికలు, వారపత్రికలో సినిమా బొమ్మలు చూడటం కూడా పడదు ఏ రోజూ!

ఇంతకూ వచ్చిందెవరో?

ఓ నాలుగు రోజుల తర్వాత ప్రక్కింటి రేడియో బామ్మగారు - ఆవిడే ప్రపంచంలోని వార్తలన్నీ పోగేసుకొచ్చి ఇంటింటికీ చేరవేస్తుంది - చెప్పింది - అతగాడి పేరు రమణారావు, ఏదో కంపెనీలో ఉద్యోగి అనీ.

వసంతలక్ష్మికి ఇంకా వివరాలు తెలుసుకోవాలని వుంది. అతనెలా వుంటాడు?

పెళ్ళయిందా? ఏ ఊరు? ఇలా - మనిషి పొడుగ్గా వుండి, గిరజాల క్రాపు ఉంటే వసంతలక్ష్మికి ఇష్టం! నచ్చుతాడు.

ఐదేళ్ళ క్రితం వసంతలక్ష్మి పెళ్ళి చూపులకు సిద్ధమైంది. అప్పుడు తల్లి ఇంకా బ్రతికే వుంది. ఆమె సణుగుడు, పోరు వల్లనే అన్నయ్య సంబంధం తెచ్చాడు. వదిన ఇచ్చిన పాత పట్టుచీర కట్టుకుంది. పట్టుచీర బరువుగా వుంది. అయినా బుట్టబొమ్మలా ఉన్న తను, అందగత్తెనే అనుకుంది వసంతలక్ష్మి. అమ్మ తన మెళ్ళో ఓ ఒంటిపేట గొలుసు వేసింది. తల దువ్వి మల్లెపూలు తురిమింది. కాళ్ళకు వెండి పట్టాలు, కళ్ళకు కాటుక, ఆ రూపం వసంతలక్ష్మికి ఎంతో యిష్టం.

రాబోయే పెళ్ళికొడుకు ఎలా ఉంటాడో అన్న ఊహ, ఆలోచనతో, గగుర్పాటు. ఏదో కరెంటు వళ్ళంతా ప్రాకుతున్న అనుభూతి. సాయంత్రం దాకా ఆ అనుభూతిని అనుభవించింది.

విఠల్, అన్నయ్య, వసంతలక్ష్మి కన్నా రెండేళ్ళే పెద్ద - అయితేనేం వాడికిప్పటికే జుత్తు ఊడిపోయింది. పీచు తీసిన కొబ్బరికాయలా తల. బద్ధకానికి చిహ్నంగా పెద్ద బొజ్జ. నిజంగా అన్నయ్య బావుండడు. తను చచ్చినా, అన్నయ్య లాంటి వాడిని భర్తగా అంగీకరించదు, అనుకుంది వసంతలక్ష్మి.

అన్నతో వచ్చినతను - పెళ్ళికొడుకు ఎంత బావున్నాడు!

వసంతలక్ష్మి తలెత్తి ఒకేసారి చూసిందతనిని. అయితే ఏం? అతని రూపం పూర్తిగా మనోఫలకంపై చిత్రించుకుంది.

అతను - పొడుగ్గా తెల్లటి దుస్తుల్లో అందంగా ఉన్నాడు. చామనఛాయ! కళగల మొహం, గిరజాల క్రాపు, తేనె కళ్ళు, నాలుకబద్ద వెడల్పులో మీసం, పెదవుల మధ్య సిగరెట్....

వసంతలక్ష్మికి అతను నచ్చాడు. ఏమైనా అతన్నే చేసుకోవాలనుకుంది.

ఎన్నో రాత్రిళ్ళు, కలలో అతనితో గడిపింది.

..... వెన్నెల డాబా మీద పరుపు మీద అతను శేషతల్పంపై విష్ణుమూర్తిలా పవ్వళించి సిగరెట్ త్రాగుతున్నాడు. వసంతలక్ష్మి తెల్లచీర కట్టుకుంది. గచ్చకాయ రంగు జాకెట్ తలంటుకున్న జుత్తు, జడలో ఎర్రగన్నేరు పువ్వు.

చప్పుడు చేయకుండా వెళ్ళి వసంతలక్ష్మి అతని కళ్ళు మూసింది.

అతను, చేతలతో మొదలెట్టి, "ఎవరూ" అనంటూ, నడుం పట్టుకుని మీదకు లాగేసుకున్నాడు.

.... మూడు రోజులుగా తుఫాను. అతను ఆఫీసుకు ఆ మూడునాళ్ళూ గైరు హాజరు. తను వంట చేస్తుంటే, అతగాడొచ్చి, 'ఇదేమిటో అదేమిటో', ఇలాగేనా, రుబ్బటం అంటూ బుగ్గలూ, జబ్బలూ పట్టుకోవటం, గిలిగింతలు పెట్టడం! స్నానం చేస్తున్నా లక్ష్య పెట్టకుండా

బాత్‌రూంలోకి బలవంతాన చొరబడి కళ్ళప్పగించి చూస్తూ నిలబడిపోవడం.

తను చిరుకోపం ప్రదర్శించి సిగ్గుతో ముడుచుకుపోతే, "ఓహో! ఇంత అందం నాకెందుకు చూపలేదిన్నాళ్ళూ!" అని మరీ దగ్గరకు రావడం.

..... జనవరి నెల. అతనూ, తనూ అమ్మగారింటి కెళ్ళారు సంక్రాంతికి. రెండు ఝాములు ప్రొద్దెక్కినా దుప్పటి ముసుగు తీయకపోవటం మాట అటుంచి తననూ రానియ్యక పోవడం. అంతేగాదు, మిట్ట మధ్యాహ్నం గూడ చలి చలి అంటూ కౌగిలి వదలకపోవడం- దాంతో అమ్మ పిల్చి చాటుకు, "ఏమిటే మరీ చోద్యం, పట్టపగలు కూడా!" అని అటు హెచ్చరిక, ఇటు సలహా కాకుండా సంతోషమూ, సాధింపుతో చెప్పడం.

వదిన, "ఏమిటో! మేమూ కాపురాలు చేస్తున్నాం ఇంత పిచ్చి ఎరగం. రాత్రి పగలు లేకుండా గది తలుపులు బిడాయించుకోవడం ఏమిటో!" అనడం ప్రక్కింటి వాళ్ళతో.

ఎంత మధురమైన అనుభూతి!

ఆ తర్వాత కొన్నాళ్ళకు తెలిసింది ఆనాడు అన్నయ్య వెంబడి వచ్చిన అతను పెళ్ళికొడుకు కాదట. అతని ఫ్రెండు. మిలట్రీలో వున్నాడుట. అతని పక్షాన చూచేందుకు ఇతగాడు వచ్చాడట.

వసంతలక్ష్మి, మనోఫలకం మీద నుంచి రంగుల బొమ్మను కడిగేసుకుంది. అయినా ఆ దృశ్యాలు లీలగా కనబడుతుంటాయి అప్పుడప్పుడు.

ఇలా కలలు కనే అవకాశం ఎల్లప్పుడూ రాదు వసంతలక్ష్మికి. ఎందుకంటే ఆఫీసులో మేనేజరు సాధింపు, ఇంటి దగ్గర ఒంటరితనం, ఏమిటో లేదన్న భావన - వీటితో బ్రతుకు భారంగా వుందేమోననిపిస్తుంటుంది.

అయితే కాంపౌండ్‌లోని మిగతా వాళ్ళను చూస్తుంటే....

ఆ పోర్షన్‌లో రంగారావుగారుంటారు. ఆయనే ఆ కాంపౌండ్‌లోని అద్దెకున్న వాళ్ళలో ఆస్తిపరుడు. ఆయనకు క్షయ. దానిని నయం చేసుకునేందుకు బస్తీలో కాపురం రెండో భార్యతో. ఆ రెండో భార్య, మొదటి భార్య నాలుగో చెల్లెలే! అంటే ఆయనకి యాభై, ఆ అమ్మాయికి ఇరవై. పెళ్ళికి ముందే ఆయనకు ఈ రోగం వుంది కాబోలు. ఆస్పత్రిలో చేరితే చేసేందుకు మనుషులుండరని, పెళ్ళి చేసుకుని వచ్చాడు ఈ మధ్యనే. ఆ అమ్మాయి అరుణను చూస్తుంటే వసంతలక్ష్మికి జాలి! రంగారావు రాత్రింబవళ్ళు దగ్గుతూనే ఉంటాడు. అరుణ మంచాన్ని కనిపెట్టుకు, కొరివి దయ్యంలా కూర్చోనుంటుంది. ఎప్పుడన్నా, ఓ క్షణం ఎవరింట్లోనన్నా కూర్చున్నా, మాట్లాడినా ఆ మొగ మహారాజు, 'లంజా, ముండా' పదాలతో సణుగుతాడు.

"ఎంత బావయినా, ఆస్థి వున్నా ఎలా చేసుకున్నారండీ!"

"మా అక్క బలవంతం అండీ. చచ్చేప్పుడు ఒట్టు వేయించుకుంది. అయినా ఆకలికి అలమటించేకంటే ఇది నయం కదండీ!" అంది అరుణ.

ఆ రంగారావు ప్రక్క పోర్షనులో ఓ జంట కాపురముంటారు. అతని పేరు గోపాల్. ఆవిడ పేరు రాధ. ఆ గోపాల్ ఏదో కొట్లో గుమాస్తా. ఎప్పుడూ ఈసురోమంటూ ఉంటాడు. ఆవిడ పూజలు, వ్రతాలు, మడీ, నోములు. రోజూ మూడు గంటల తర్వాతే భోజనం చేస్తుంది. వాళ్ళు ఎవరితో కలవరు, మాట్లాడరు.

ఇవతల రెండు వాటాల్లో, ఓ దాంట్లో వృద్ధ దంపతులు. ముసలాయన పేరు రాఘవయ్య. కళ్ళు కనబడవు. పైగా పెద్దతనం. మంచం మీదే మహారాజులా కూర్చుంటాడు. భార్య సుబ్బాయమ్మ - అనగా రేడియో బామ్మగారు - చెప్పిన కబురు చెప్పకుండా చెబుతుంటుంది. ఎవరింట్లో ఏం జరిగిందీ, ఏం వండుకుందీ, భార్య భర్తల తగాదాకు కారణాలేమిటీ, ఇలా దినచర్య అంతా ఆవిడ తెలుసుకుంటూ మరొకరికి అందజేస్తూ వుంటుంది.

ఆ మిగిలిన వాటాలో ఓ డబ్బుగల ముసలమ్మ - గంగాబాయమ్మ వుంటుంది. కొడుకు - కోడలు వూళ్ళోనే వుంటారు. ఈవిడ మాత్రం ఇక్కడ గది అద్దెకు తీసుకుని, వుంటుంది. వంద రూపాయలకు ఓ పనిమనిషి. ఆ పనిమనిషి హోటల్ నుండి టిఫిను, భోజనం తెస్తుంది. గంగాబాయమ్మ, జలుబు చేస్తే చాలు నర్సింగ్‌హోంలో చేరుతుంది!

వీళ్ళందరిని చూశాక, వసంతలక్ష్మికి ధైర్యం వస్తుంది. తను ఏకాకే అయినా స్వతంత్రురాలు. బాదర బందీలు లేవు.

వసంతలక్ష్మికి తల్లి పోయింది రెండేళ్ళనాడు. ఆమె పోయాక, వసంతలక్ష్మి ఏకాకి అయింది. అన్నగారు తల్లి ఉన్నప్పుడే, వసంతలక్ష్మి బాగోగులు చూడటం అంతంత మాత్రం. ఆమె పోయాక, యింతే సంగతులు. ఎప్పుడన్నా మనస్సు ఉండబట్టలేక, వసంతలక్ష్మి, అన్నను చూసి వస్తుంది.

"అమ్మాయి! ఏం చెప్పమంటావే నా బాధ. నలుగురు ఆడపిల్లలు. వీళ్ళందరినీ ఎలా సాకాలో, పెళ్ళిళ్ళు ఎలా చెయ్యాలో దిగులు పుట్టి ఛస్తున్నాననుకో. నా జీతం సంగతి తెలుసుగా! ప్లీడరీ గుమాస్తా. కోడిగుడ్డుకు వెంట్రుకలు లాగాలి. ఈ సంపాదన ఇలా వుంటే మీ వదినకు షుగరు. లేవలేదు". ఇదీ అన్న వరస. ఉన్నంతసేపూ బీద అరుపులు- కష్టాలు ఏకరువు పెట్టడమే.

వదిన సరేసరి - "రాక రాక వచ్చావు. కాస్త ఏదైనా చేసి పెడదామంటే ఓపిక లేదు, పిల్లలు నెలబట్టీ వేధించుకుతింటున్నారు, ఏమన్నా చెయ్యమని. ఏదీ లేస్తే గదా. సినిమా చూసి ఆర్నెల్లు. ఏమిటో వసంతా! నీలాగా వుంటేనే సుఖం."

వసంతలక్ష్మి తీసుకెళ్ళిన డబ్బులు అయిపోయిందాకా వుండి, మళ్ళీ గూడు చేరటం! మళ్ళీ కథ మొదలు.

రోజులు, నెలలు గడుస్తున్నాయి.

ఇదిగో, ఇప్పుడు మేడ మీది రేకుల గదిలోకి అద్దెకు, ఎవరో రావడమే విశేషం.

:: 2 ::

ఆదివారం.... వసంతలక్ష్మి తీరికగా రేడియోలో అర్చన కార్యక్రమం మొదలవుతుండగా నిద్ర లేచింది. కుంపటి మీద కాఫీకి నీళ్ళు పడేసి, మొహం కడుక్కుంటుండగా, మేడ మీది అబ్బాయి, బకెట్‌తో, బావి దగ్గరకు నీళ్ళ కొచ్చాడు.

రేడియో బామ్మగారు, "అమ్మాయి వసంతా! ఇతగాడే మీడ మీది గదిలో ఉంటున్నది. పేరు రమణారావు" అని పరిచయం చేసేసి, మొగుడు కేకేస్తే వెళ్ళింది.

రమణారావు.... ఎక్కడో చూసిన గుర్తు. వసంతలక్ష్మి అతన్నే చూస్తూ నిలబడ్డది. రమణారావు ఎండిపోయి బక్కగా వున్నాడు. మెడలో తాయిత్తు. గూట్లో దీపం పెట్టినట్లు కళ్ళు. చిరిగిన లుంగీ - ఎక్కడ చూసింది?

రమణారావు అతికష్టం మీద, నీళ్ళు తోడుకుని, మేడమీదకు వెళ్ళాడు.

కాఫీ త్రాగి, ఆ కుంపటి మీదనే పోసుకునేందుకు నీళ్ళు పెట్టుకుని, తీరిగ్గా అద్దం ముందు కూర్చుని జడ వేసుకోసాగింది వసంత!

జుత్తు.... సగం నలుపు, సగం తెలుపు! కళ్ళ క్రింద నల్లటి చారలు. చెక్కిళ్ళు, ఎండకు నల్లబడ్డాయి. 'వయస్సు మీదబడుతున్నది' అనుకుంది వసంతలక్ష్మి.

"మీరు విఠల్ చెల్లెలా?"

ఆ పిలుపుకు తలెత్తి చూసింది.

రమణారావు గడప కవతల. ఇప్పుడు మాసిపోయిన చొక్కా వేసుకుని వున్నాడు.

"రాండి..." కుర్చీ చూపించింది.

రమణారావు కూర్చున్నాడు.

"మీరు విఠల్ చెల్లెలా?" మళ్ళీ అడిగాడు రమణారావు.

"ఏ విఠల్?"

"అదే! గుంటూరులో ప్లీడరు గుమాస్తా!"

"అవును."

"అయితే నన్ను గుర్తు పట్టలేదా మీరు?"

వసంతలక్ష్మి, అతన్ని పైనుంచి కింది దాకా చూసింది.

తలపై భాగమంతా జుత్తు లేదు, తెల్లబడ్డ మీసాలు, గారపళ్ళు ఎవరితను?

"లాభం లేదండీ. ఇదివరకు నన్ను చూసినవాళ్ళెవరూ నన్ను ఇప్పుడు గుర్తుబట్టలేరండీ. ఇదివరకు చాలా బావుండేవాడిని. తెల్లగా మల్లెపూవు లాంటి గుడ్డలే వేసేవాడిని. గిరజాల క్రాపుండేది. హీరోలా మీసం - అబ్బే మీకింకా గుర్తు రాలేదా! ఓ రోజు పెళ్ళిచూపుల కొచ్చాలెండి!"

వసంతలక్ష్మి అతను చెబుతున్నంతసేపు పరీక్షగా అతనినే చూస్తు ఉండిపోయింది. తను రంగుల కలలో పెళ్ళికొడుకు ఇతనా? ఇలా అయ్యాడేం?

"దానికి చాలా కథుందిలెండి. అప్పుడు మద్రాసు వెళ్ళాలెండి - సినిమాల్లో వేషాలేసేందుకు. అప్పే అక్కడ మనలాంటి వాళ్ళకు చోటు లేదు. అంతా కులం, గొడవలు. పైగా వున్నవాళ్ళు క్రొత్తవాళ్ళను రానివ్వరు. పైగా మనకు డబ్బు లేదు గదా....వచ్చేసాను. టైఫాయిడ్ జ్వరం - ఏమిటో ఇలా అయ్యాను."

"ఇప్పుడేం చేస్తున్నారూ?"

"మొన్నే ఓ మిత్రుడు కనబడి 'ఊరికే ఎందుకురా వెధవా! నేనెలాగూ సినిమా తియ్యాలని ప్రయత్నిస్తున్నాను. కథ, మాటలు సిద్ధం. డబ్బు పెట్టే పార్టనర్ కోసం చూస్తున్నాను. అది సెటిల్ అయితే మద్రాసు వెడదాం' అన్నాడు. అదిగో అంతదాకా కాలక్షేపం - పళ్ళపొడి సేల్స్‌మన్‌గా వుంటున్నా!" రమణారావు తనేదో ఘనకార్యం చేస్తున్నట్లు.

రంగుల కల కాలి భస్మమైపోయింది. రమణారావు అత్తారింట్లో కూర్చున్నట్లు బైఠాయించి ప్రశ్నల వర్షం మొదలెట్టాడు.

అన్నింటికీ సమాధానం చెప్పింది. చేస్తున్న ఉద్యోగం, జీతం - అన్నీ చెప్పింది.

"ఏమిటోనండీ, అస్సలు ఆనాడే మిమ్మల్ని పెళ్ళి చేసుకోవాల్సింది. కుదరలేదు. రాసి పెట్టి ఉండటమంటే ఇదే కాబోలు. మీకూ ఇంకా పెళ్ళి కాలేదు. నాకూ అంతే. మళ్ళీ ఒకచోట కలిశాం! బాగుందండీ, వస్తుంటాలెండి! ఏమన్నా అవసరమైతే కేకెయ్యండి" అని చెప్పి వెళ్ళాడు రమణారావు.

ఆ రోజంతా ఆలోచిస్తూనే వుంది వసంతలక్ష్మి - తనకు ఆనాడు రమణారావుతో పెళ్ళి కాకపోవడం వరమా? శాపమా అని!

ఆ సాయంత్రం రేడియో బామ్మగారు కబురు మోసుకుని రానే వచ్చింది.

"ఏమ్మా లక్ష్మి, రమణారావు నీకు బాగా తెలుసటగదా! అయితే ఇంకేం మంచి రోజు చూస్తే, మీ యిద్దరి పెళ్ళి మేం జరిపిస్తాం!"

పెళ్ళా ఇన్నేళ్ళొచ్చి? అదీ రమణారావుతోనా?

పెళ్ళి చేసుకుని! ఊ! ఏం బావుకోవాలి? ములక్కాడలా వున్న రమణారావు అనే మొగుడు చలాయించే అధికారానికీ, దాష్టికానికీ లొంగి వుండాలా? జీవితాంతం అతడిని పోషిస్తూ, ఊడిగం చేసి, పుణ్యవతి అనిపించుకోవడమేగా పెళ్ళంటే! లాభం లేదు.

తను అరుణలా డబ్బు కోసం ముసలాడినీ, రాధలా ఎవరో, పుణ్యం కొద్దీ పురుషుడు దొరకాడు చాలనుకుని, కోరికలకు గుడ్డ కప్పేసి, నోములూ, వ్రతాలూ చేసుకుంటూ జీవితాన్ని గడపలేదు.

వసంతలక్ష్మి దృష్టిలో, పెళ్ళనేది జీవితానికి తోడు - సరదాగా, సంతోషంగా జీవితంలోని చీకటి వెలుగులని పంచుకుని ముందుకు సాగాలి. అంతేగానీ, పెళ్ళనే భ్రమలో హీనుడికీ, దీనుడికీ తల వంచడం, మురుగు గుంటలో పురుగు లాగా బ్రతకటం నీచం! హైన్యం గూడ. అందుకే - వసంతలక్ష్మి వేరే ఇంట్లోకి మారింది. ●